సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

క్రీడలతో స్నేహభావం



క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సరస్వతీ విద్యాపీఠం ప్రాంత శైక్షణిక్ ప్రముఖ కృష్ణమాచార్యులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో రాష్ట్రస్థాయి ఖేల్ కూద్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

- 9లో ▸

న్యూస్‌రీల్

నేడు అమరవీరుల స్మృతి వనం ప్రారంభం



ప్రారంభోత్సవానికి ముస్తాబైన స్మృతివనం

ఇంద్రవెల్లి:మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన స్మృతి వనంను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుతో కలిసి గురువారం ప్రారంభించనున్నారు. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే మండలకేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు.

'ఏ టూ జడ్'పై 8 రోజుల సస్పెన్షన్

సాక్షి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో మెడికల్ షాపుల నిర్వాహకులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్న తీరుపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చర్యలు చేపట్టారు. 'మెడికల్ మాయాజాలం' శీర్షికన ఈనెల 8న ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత ఏ టూ జడ్ మెడికల్ షాపును తనిఖీ చేసి నోటీసు జారీ చేశారు. ఆ శాఖ ఏడీకి ఈ విషయంపై నివేదిక అందజేశారు. దీంతో ఆయన ఎనిమిది రోజుల పాటు మెడికల్ షాప్‌పై సస్పెన్షన్ విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. అలాగే ఒకరికి బదులు మరొకరు నిర్వహణ చేపట్టినా షాపు లైసెన్స్ రద్దు చేస్తామని పేర్కొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం అధికారికంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి వద్ద గల ఐలమ్మ విగ్రహానికి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రజక సంఘం నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ పోరాటపటిమను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు చిక్కాల దత్తు, సంతోష్, వినోద్, భరత్, బీజేపీ నాయకులు ఆదినాథ్, లాలా మున్నా, రఘుపతి, సచిన్,నిఖిల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న '104' ఉద్యోగుల నిరసన



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 104 సేవల ఒప్పంద ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కొనసాగుతోంది. తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఖాళీ ప్లేట్లతో నిరసన వ్యక్తం చేశారు.ఐదు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కిరణ్ వీరికి మద్దతు తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్

కైలాస్‌నగర్: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. 12 మంది సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు గాను జిల్లా సహకార శాఖ అధికారి బి.మోహన్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలోని వంద సహకార సంఘాల అధ్యక్షులు ఇందులో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 12న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు వాటి పరిశీలన, 3.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉపసంహరణ గడువు ఉంటుందని తెలిపారు. 17న ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. లంచ్ తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. 13న ఆఫీస్ బేరర్లను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ అంతా భుక్తాపూర్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పంట నష్టం వివరాలు..	
పంట నష్టం	18,311 ఎకరాలు
రైతుల సంఖ్య	12,338

రహదారులకు సంబంధించి ఆర్అండ్‌బీ, పీఆర్ శాఖల వారీగా అంచనా వ్యయం నివేదికలు	ఆర్అండ్‌బీ	పీఆర్
తాత్కాలిక అంచనా వ్యయం	రూ.3.15 కోట్లు	రూ.3.80 కోట్లు
శాశ్వత అంచనా వ్యయం	రూ.66.70 కోట్లు	రూ.60.85 కోట్లు

అమాత్యా.. ఆశలన్నీ మీపైనే

- వర్షాలతో జిల్లాలో భారీ నష్టం
- పంట పరిహారంపై రైతుల ఎదురుచూపు
- రహదారుల మరమ్మతు నిధుల మంజూరు కూడా..
- నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి రాక



నార్నూర్ కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యువరాజ్

విద్యార్థుల భోజనంలో పురుగులు..
మంత్రి జూపల్లి ఉమ్మడి జిల్లా పర్యటనలో ఉండగానే జిల్లాలో చోటు చేసుకున్న ఓ సంఘటన పాఠశాలల్లో వసతుల లేమిని తేటతెల్లం చేసింది. నార్నూర్‌లోని కేజీబీవీలో బుధవారం భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సబ్ కలెక్టర్ వెళ్లి వారితో మాట్లాడడంతో శాంతించారు.ఓ వైపు ప్రభుత్వం పాఠశాల విద్య మెరుగు కోసం అనేక వసతులు కల్పిస్తున్నామని చెబు తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఇలాంటి సంఘటనలు లోపాలను ఎత్తి చూపుతున్నాయి.

సాక్షి,ఆదిలాబాద్: జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తీవ్ర నష్టం చేకూరింది. ప్రధానంగా పంట నష్ట పరిహారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అలాగే దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు తాత్కాలిక మరమ్మతులు, శాశ్వత నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సరైన దారులు లేకపోవడంతో జిల్లాలో ఇటీవల జరిగిన రెండు ప్రసవ వేదన ఘటనలు ఆందోళన కలిగించాయి. మరో పక్క పాఠశాల విద్యార్థుల భోజనంలో పురుగులు రావడం కలకలం కలిగిస్తుంది. జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న మీరు ఈ విషయాలపై స్పందించే తీరుపై జిల్లావాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పరిహారం కోసం రైతులు..
ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఇటీవల వ్యవసాయ శాఖ సర్వే కూడా చేపట్టింది. పత్తి, సోయా, కంది పంటలకు నష్టం చేకూరినట్లు తేలింది.కాగా, గతనెలలో జిల్లాలో పర్యటించి న సమయంలో పంట నష్టాన్ని మంత్రి జూపల్లి స్వయంగా పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఈనేపథ్యంలో రైతులు ప్రభుత్వ ప్రకటనపై వైపు ఆశగా చూస్తున్నా రు. ఎకరానికి రూ.25వేల పరిహారం చెల్లించాలని ప్రతిపక్ష పార్టీలు, రైతులు కోరుతున్నారు.

రోడ్లు, వంతెనలకు నష్టం..
భారీ వర్షాలకు జిల్లాలోని పలు రోడ్లు, లోలెవల్ వంతెనలు దెబ్బతిన్నాయి. రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి నష్టాలను కూడా అంచనా వేశారు. తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలకు ఎంతెంత వ్యయం అవుతుందో నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రధానంగా మారుమూల గ్రామాల రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో రవాణా కష్టతరంగా మారింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం తక్షణం నిధులిచ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడమే కాకుండా భవి ష్యత్తులో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రసవ వేదన..
జిల్లాలోని మారుమూల గ్రామాలకు మామూలు రోజుల్లోనే ప్రయాణం చేయాలంటే కష్టతరం. అలాంటిది ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పలు చోట్ల రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కనీసం నడవలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల జిల్లాలో ప్రసవ వేదనకు సంబంధించి మరో రెండు ఘటనలు రహదారుల దుస్థితికి అద్దం పడుతున్నాయి. ఆదిలాబాద్‌రూరల్ మండలం బొప్పాపూర్ (ఏ)కు చెందిన గర్భిణి పెందూర్ ధనలక్ష్మికి ఇటీవల పురిటి నొప్పులు రావడంతో కాలినడకన ఇంద్రవెల్లికి తీసుకెళ్లే క్రమంలో ఆమె మార్గ మధ్యలోనే మృతశిశువుకు జన్మనిచ్చింది. అలాగే భీంపూర్ మండలం భగవాన్‌పూర్‌కు చెందిన గర్భిణి ప్రియాంకను ఆసుపత్రికి తరలించే క్రమంలో రహదారి సౌకర్యం లేక 108 వాహనం సైతం రాలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆమె మార్గ మధ్యలోనే మృతశిశువుకు జన్మనిచ్చింది.

బోథ్ రెవెన్యూ డివిజన్..
బోథ్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా మార్చుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ త్వరగా నెరవేర్చాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రిమ్స్‌లో వసూల్ రాణి

- పారామెడికల్ విద్యార్థుల నుంచి డబ్బులు డిమాండ్
- ఒక్కొక్కరి నుంచి రూ.5వేల వరకు..
- హాజరు కోసం కాసులకు కక్కుర్తి

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ని విమర్శలు ఎదుర్కొంటున్నా రిమ్స్‌లో పనిచేసే కొంత మంది ఉద్యోగులు, అధికారుల తీరు మాత్రం మారడం లేదు. గతంలో కొంత మంది ఇలా వసూళ్లకు పాల్పడి సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. తాజాగా మరోవసూలు 'క్వీన్' బాగోతం బయటపడింది. జిల్లాలోని ఆయా నర్సింగ్ కళాశాలల్లో శిక్షణపొందే విద్యార్థులు రిమ్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నారు. వీరు ఏడాది పాటు రిమ్స్‌లోని ఆయా విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. డీఎంఎల్టీకి సంబంధించి మైక్రోబయోలజీ, పాథాలజీ, బయోకెమిస్ట్రీలో 90 రోజుల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. అయితే కొంత మంది వివిధ కారణాలతో గైర్హాజరవుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని రిమ్స్‌లో పనిచేసే ఓ మహిళా అధికారి ఇటీవల ఆ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ బాగోతం రిమ్స్‌లో చర్చనీయాంశంగా మారింది. అయినా అధికారులు చర్యలకు వెనుకాడుతుండడం విమర్శలకు తావిస్తోంది.

అటెండెన్స్ సర్టిఫికెట్ కోసం..
శిక్షణ పొందుతున్న విద్యార్థులు హాజరు పత్రాన్ని తీసుకొని సంబంధిత కళాశాలల్లో సమర్పించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా రిమ్స్‌లోని ఆయా విభాగాల అధిపతుల వద్ద నుంచి సంతకాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆర్ఎంఓ, మెడికల్ సూపరింటెండెంట్, చివరిగా డైరెక్టర్ ఆ అటెండెన్స్‌పై సంతకంపెడతారు. విద్యార్థులు గైర్హాజరైన కాలాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఎన్ని రోజులు గైర్హాజరైతే మరోసారి అన్ని రోజుల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. అయితే గైర్హాజరైన విద్యార్థులను గుర్తించి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.2వేల నుంచి రూ.5వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..
డీఎంఎల్టీ విద్యార్థులు అటెండెన్స్ సర్టిఫికెట్ కోసం అధికారులకు డబ్బులు ఇస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఎవరైన డబ్బులు ఇచ్చినట్లు ఉంటే నా దృష్టికి తీసుకురావాలి. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై విచారణ చేపడతాం. ఉద్యోగులు, అధికారులు అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదు.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

ఆ అధికారి తీరే వేరు..
సంబంధిత మహిళా అధికారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు. అసభ్యపదజాలంతో దూషిస్తారని, కార్యాలయ పనులు చేయిస్తున్నారని పేర్కొంటున్నారు. అవసరం ఉన్న విభాగాలకు కాకుండా నచ్చిన విభాగాలకు పంపిస్తున్నారని చెబుతున్నారు. సదరు అధికారి రిమ్స్‌లో పనిచేస్తున్న నుంచి వివాదాస్పదంగా ఉన్నట్లు ఉద్యోగులు సైతం పేర్కొనడం గమనార్హం.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రధానోపాధ్యాయుల సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు జిల్లా విద్య శాఖ అధికారి ఖుష్బూ గుప్తాను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళను డీఈవో శాలువాతో సత్కరించారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్ సింగ్ తిలావత్, భరత్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌రూరల్: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆవరణలో ఉన్న వాహనాలకు సంబంధించిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టే దిశగా వారానికి కనీసం రెండు సార్లు పర్యటించాలన్నారు. సాయంత్రం సమయంలో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టి ప్రమాదాలను నివారించాలని సూచించారు. అలాగే రాత్రి గస్తీ పెంచాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ కె.ఫణిదర్, ఎస్సై వి.విష్ణువర్ధన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతిభ వెలికితీయాలి

- ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ట్రెయినీ కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. టీఎల్ఎం ద్వారా విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ భూమన్న, డీఎస్‌డీవో శ్రీనివాస్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి తిరుపతి, రఘురమణ, డీసీఈబీ కార్యదర్శి గజేందర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక
ఆదిలాబాద్‌రూరల్: జిల్లాస్థాయి మేళాలో మావల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల–2 ఉపాధ్యాయురాలు కవిత ప్రదర్శించిన ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అధికారులు వెల్లడించారు. ఈమేరకు మండల విద్యాధికారి సరోజ, ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ రెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ అవార్డు దక్కాలని ఆకాంక్షించారు.

డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలన
పంటల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడలో డిజిటల్ క్రాప్ సర్వే తీరును బుధవారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

'పరిషత్' ఓటర్లు @ 4,49,981

- పురుషులతో పోల్చితే మహిళలే అధికం
- అదనంగా మరో రెండు పోలింగ్ కేంద్రాలు
- తుది జాబితా విడుదల



పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లా, మండల పరిషత్ ఓటర్ల లెక్క తేలింది. ప్రాదేశిక ఎన్నికల కసరత్తులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల తుది జాబితాను జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి విడుదల చేశారు. జిల్లా పరిషత్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయాల నోటీసుబోర్డులపై ప్రదర్శించారు. జిల్లావ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 4,49,981 మంది ఓటర్లు ఉన్నట్లుగా గుర్తించారు. ఇందులో పురుషులు 2,19,652 మంది, మహిళలు 2,30,313, ఇతరులు మరో 16 మంది ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లు 10,661 మంది అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్యకనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్ల సౌకర్యార్థం అదనంగా రెండు కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగానే పరిషత్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రెండు కేంద్రాలు పెంపు
ఓటర్ల సంఖ్యకనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముసాయిదా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 875 పోలింగ్ కేంద్రాలు ఉండగా రెండింటిని కొత్తగా ఏర్పాటు చేశారు. బోథ్ మండలం కరత్వాడ జీపీ పరిధిలోని జిడిపల్లిలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, మావల మండలం బట్టిసావర్‌గాంవ్‌లో మరో కేంద్రం ఏర్పాటు చేశారు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	ఎంపీటీసీ స్థానాలు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆదిలాబాద్‌రూరల్	10	55	13,854	14,674	00	28,528
బజార్‌హత్నూర్	08	47	11,687	12,141	01	23829
బేల	09	51	13,825	13,762	00	27,587
భీంపూర్	07	43	9,312	10,166	00	19,478
భోరజ్	06	30	7,302	7,656	00	14,958
బోథ్	10	51	13,022	14,236	01	27,259
ఇచ్చోడ	13	70	17,131	18,114	00	35,245
గాదిగూడ	06	31	7,695	8,104	00	15,799
గుడిహత్నూర్	09	54	12,361	12,929	00	25,290
ఇంద్రవెల్లి	12	64	16,033	16,416	03	32,452
జైనథ్	07	36	9,741	10,253	00	19,994
మావల	05	09	2,103	2,283	00	4,386
నార్నూర్	08	43	11,606	11,775	04	23,385
నేరడిగొండ	08	48	11,517	12,352	00	23,869
సాత్నాల	05	23	5,271	5,421	00	10,692
సిరికొండ	05	28	6,431	6,714	00	13,145
సొనాల	05	20	5,293	5,511	00	10,804
తలమడుగు	10	57	13,481	14,376	00	27,857
తాంసి	05	27	6,515	7,267	00	13,782
ఉట్నూర్	18	90	25,472	26,163	07	51,642

యూరియా.. తిప్పలు



ఉట్నూర్‌లో బారులు తీరిన రైతులు

ఇచ్చోడ/ఉట్నూర్‌రూరల్: ఈ ఏడాది రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. సహకార సంఘాలకు ఎరువు స్టాక్ వచ్చిందని తెలిస్తే చాలు వేకువజామునే అక్కడికి చేరుకుంటున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షిస్తున్నారు. ఇచ్చోడ, ఉట్నూర్ మండల కేంద్రాల్లోని సహకార సంఘ కార్యాలయాల ఎదుట బుధవారం ఉదయం నుంచే బారులు తీరి దర్శనమిచ్చారు. ఇచ్చోడలో 444 బ్యాగులు రాగా చాలామంది ఎరువు లభించక నిరాశతో వెనుదిరిగారు. యూరియా కొరతను నిరసిస్తూ ముఖరా(కే)లో మాజీ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. ఉట్నూర్‌లోని పీఏసీఎస్ కార్యాలయానికి ఉదయాన్నే సుమారు 200 మంది రైతులు తరలిరాగా రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

జీపీవోలకు పోస్టింగ్

- జిల్లాలో 81 మందికి ఆర్డర్లు
- సజావుగా కౌన్సెలింగ్ ప్రక్రియ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: గ్రామ పాలనాధికారులు వచ్చేశారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న 83 మందికి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 82మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 183 రెవెన్యూ క్లస్టర్ల వివరాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రకటిస్తూ మెరిట్ ఆధారంగా అభ్యర్థులు ఎంచుకున్న క్లస్టర్లకు పోస్టింగ్ కల్పించారు. సొంత నియోజకవర్గం, మండలంలో కాకుండా ఇతర క్లస్టర్‌కు 81 మందికి పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఆర్డర్లు అందుకున్న వారు గురువారం సంబంధిత తహసీల్దార్‌కు రిపోర్టు చేసి కేటాయించిన క్లస్టర్ పరిధిలో విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఏసీబీ కేసులు ఎదుర్కొన్న వారికి పోస్టింగ్ ఇవ్వవద్దని సీసీఎల్ఏ నుంచి అందిన ఆదేశాల మేరకు ఒకరికి ఆర్డర్స్ నిలుపుదల చేశారు. మరొకరు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. దీంతో 81 మంది విధుల్లో చేరనున్నారు. ఈ ప్రక్రి య పూర్తి కావడంతో మరో 101 క్లస్టర్లకు ఇన్‌చార్జీ లను నియమించడంపై అధికారులు కసరత్తు చేపట్టనున్నారు. వారం వ్యవధిలోనే వారికి కూడా బాధ్యతలు అప్పగించనున్నట్లుగా తెలుస్తోంది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ ఏవో వర్ణ, ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శైలజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో భారీ వర్షం

- జిల్లావ్యాప్తంగా 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోత ఉండగా 3గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. చిన్నపాటి చినుకులతో మొదలైన వాన రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వాహనదారులు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడగా ప్రధానచౌక్‌ల్లోని రోడ్లు జలమయమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 22 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇందులో మావల మండలంలో 17.8 మిల్లీ మీటర్లు నమోదవగా నేరడిగొండలో 9.3, నేరడిగొండలో 4.5, భీంపూర్‌లో 3.3, ఇంద్రవెల్లిలో 0.8, భోరజ్‌లో0.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నవజాత శిశు మరణాలు తగ్గించాలి

కైలాస్‌నగర్: నవజాత శిశు మరణాలు నియంత్రించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇటీవల నమోదైన నవజాత శిశు మరణాలపై వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐసీఎంఆర్ టీమ్ సభ్యులు సంకల్ప పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిశు మరణాల నియంత్రణకు అనుసరిస్తున్న కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణపై మరింత దృష్టి సారించాలన్నారు. సకాలంలో వైద్య సేవలందించడం, సక్రమమైన గర్భస్థ శిశు పర్యవేక్షణ, ప్రసూతి సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం ద్వారా ఈ మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో రాథోడ్ రవీందర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకమేట భూముల అభివృద్ధికి చర్యలు
ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సంభవించిన వరదల కారణంగా ఇసుక మేటలతో నిండిపోయిన భూముల గుర్తింపునకు ఈ నెల 12నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఏవోలతో తన క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పలు మండలాల్లో పంట భూములు ఇసుకతో నిండిపోవడం, భూమి కోతకు గురవడం, ఇసుక మేటలు ఏర్పడి సాగుకు యోగ్యంగా లేకుండా మారాయన్నారు. ఈ మేరకు ఆ భూములను మళ్లీ సాగుకు యోగ్యంగా మార్చేందుకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిబంధనల ప్రకారం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదిలాబాద్ రూరల్, భోరజ్, జైనథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ, నేరడిగొండ మండలాల్లో అంచనా వేసేందుకు వ్యవసాయ అధికారితో పాటు ఎంపీడీవో, ఏపీవో, ఈసీ, టీఏలతో కూడిన సంయుక్త బృందంతో ఈ నెల 12నుంచి 20వరకు తనిఖీలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఈజీఎస్ ద్వారా నిర్దేశించిన విధంగా లబ్ధిదారుల వారీగా ప్రతిపాదిత పనులను సంబంధిత గ్రామసభల్లో ఆమోదించి చేపట్టాలని తెలిపారు. ఇందులో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డీపీవో శ్రీధర్ స్వామి, డీపీఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపడి గేదె మృతి

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం గ్రామంలో బుధవారం పిడుగుపాటుతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనవేని శంకరయ్య తన గేదెను ఇంటిముందు చెట్టుకింద కట్టేసి ఉంచాడు. మధ్యాహ్నం వర్షం పడే సమయంలో ఒక్కసారిగా గేదెపై పిడుగు పడటంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.

మిస్సింగ్ కేసు నమోదు


లక్ష్మణ్ (ఫైల్)

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన పన్నెవాడ్ లక్ష్మణ్ (56) ఆచూకీ లభించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ గత నెల 31న తన కుమారుడు గణేశ్‌తో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలు చూసి వస్తానని కుమారుడికి చెప్పి వెళ్లిపోయాడు. 10 రోజులైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం రాత్రి అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

దొరకని శృతి ఆచూకీ


గోదావరిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరినదిలో మంగళవారం దూకి గల్లంతైన తిర్యాణి మండలం తలండికి చెందిన వివాహిత పోలోజు శృతి ఆచూకీ లభించలేదని ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. బుధవారం చీకటి పడే వరకు గజ ఈతగాళ్లు నదిలో గాలించారని పేర్కొన్నారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండెల రమేశ్‌కు చెందిన ఏడు గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. వివరాలు.. బుధవారం రమేశ్ ఏడు గొర్రెలను ఇంటిలోని ఓ షెడ్డులో కట్టేసి మిగతా వాటిని మేతకు తీసుకువెళ్లాడు. అతడి భార్య కూలీ పనికి వెళ్లిపోయింది. ఈక్రమంలో ఇంటి పరిసరాలు ప్రశాంతంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచగా అవి మృతి చెందాయి. రమేశ్ దంపతులు ఇంటికి తిరిగి వచ్చి మృతి చెందిన గొర్రెలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

నానమ్మ, మనవరాలు అనుమానాస్పద మృతి

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో ఖమ్మం పట్టణానికి చెందిన బెజ్జాల సత్యవతి(55), ఆమె మనవరాలు గీతశిరీష (4) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇదే ఇంట్లో మూడేళ్ల క్రితం సత్యవతి చిన్న కుమారుడు శిరీష (24) ట్రాన్స్‌జెండర్ సైతం అనుమానాస్పదంగా మృతిచెందడం అప్పట్లో కలకలం రేపింది. ప్రస్తుతం నానమ్మ, మనవరాలు మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రంలోని 3టౌన్‌కు చెందిన బెజ్జాల చంద్రయ్య, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు గంగోత్రి, వెంకటేశ్ ఉండగా.. చిన్న కుమారుడు వెంకటేశ్ ట్రాన్స్‌జెండర్(శిరీష)గా మారి మంచిర్యాలలో స్థిరపడింది. గోపాలవాడ శివారులో రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఓ ఇల్లు నిర్మించుకుని జీవనం సాగించింది. 2022 జనవరి 4న అనుమానాస్పదంగా మృతిచెందింది. అప్పటి నుంచి ట్రాన్స్‌జెండర్ శిరీష కుటుంబ సభ్యులు తరచూ వచ్చి వెళ్తుండేవారు. ఈ


సత్యవతి, గీత శిరీష (ఫైల్)

క్రమంలో ఈ నెల 8న గంగోత్రి తన తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషతో కలిసి ట్రాన్స్‌జెండర్ శిరీష ఇల్లు విక్రయించడానికి మంచిర్యాలకు వచ్చారు. 9న తనకు అస్తమా సమస్య వచ్చిందంటూ గంగోత్రి తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషను ఇక్కడే వదిలి ఖమ్మం వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం తన తల్లి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదంటూ పక్కింటి వారికి సమాచారం అందించాడు. స్థానికులు వెళ్లి పరిశీలించగా తలుపులు తీయకపోవడంతో 'డయల్ 100'కు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా సత్యవతి, గీతశిరీష విగత జీవులుగా కనిపించారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు పలుసార్లు గంగోత్రికి సమాచారం ఇచ్చి రావాలని సూచించినా రాకపోవడంతో అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హత్యా..? ఆత్మహత్యా..?

సత్యవతి, గీతశిరీష మృతి హత్యా..? ఆత్మహత్యా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటిని విక్రయించడానికి వచ్చిన ముగ్గురిలో ఇద్దరు ఇక్కడే ఉండడం, ఒక్కరే వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందా? అనేది చర్చనీయాంశంగా మారింది. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏం జరిగిందనేది పోస్టుమార్టం నివేదికలో తేలనుంది.

ఒకరి అనుమానాస్పద మృతి

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మురిమడుగుల మల్లయ్య (58) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈనెల 9న సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి కుర్చీలో కూర్చోగా నోటి నుంచి నురగలు వచ్చాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా,


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామయ్య

తన తండ్రి మల్లయ్య మృతికి పాము కాటా.. లేదా అనారోగ్యమా? అనేది తెలియడం లేదని మృతుడి కుమారుడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉదారి నారాయణకు కీర్తి పురస్కారం


ఉదారి నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు చెందిన కవి, రచయిత ఉదారి నారాయణ 2024 సంవత్సరానికి కీర్తి పురస్కారానికి ఎంపికైనట్లు తెలుగు యూనివర్సిటీ వీసీ సురవరం ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ యాసలో తనదైన శైలిలో కవితలు రాస్తున్నందుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డు కింద రూ.5,116 నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వివరించారు. ఆయన ఎంపిక కావడంపై పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

లక్ష్మణచాంద: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్యాల్ తండా గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. వడ్యాల్ తండాకు చెందిన దరావత్ నందు (25) గత నెల 30న తన భార్యతో కలిసి నిర్మల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ జాతీయ రహదారిపై ఇతని ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ముందు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి, ఆ తరువాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.


దరావత్ నందు (ఫైల్)

గుడుంబా పట్టివేత

భీమిని: మండలంలోని మల్లీడి గ్రామానికి చెందిన కోట ఇస్తారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల గుడుంబాను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన గుడుంబా విలువ రూ.2వేలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఏటీఎంలో చోరీకి యత్నించిన నిందితుడు బిప్లబ్‌కుమార్ జీనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం బలేశ్వర్ జిల్లా జమల్‌పూర్‌కు చెందిన నిందితుడు ఈనెల 8న అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లోగల డీబీఎస్ ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు తెలిపారు. గడ్డపారతో ఏటీఎంను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా అలారం మోగడంతో పారిపోయినట్లు పేర్కొన్నారు. దీంతో ఎస్పీ వన్‌టౌన్, టూటౌన్ సీఐలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. 2011 నుంచి 2015


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

వరకు ఆదిలాబాద్ పట్టణంలోని పలు హోటళ్లలో నిందితుడు పనిచేసినట్లు తెలిపారు. దొంగతనానికి యత్నించిన సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్న వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, టూటౌన్ సీఐ నాగరాజు, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు విద్య, వైద్యం అందించాలి


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల ఉపసంచాలకులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులతో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ద్వారా ఆశ్రమ పాఠశాలలకు సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన సహాయ సంక్షేమ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రిన్సిపల్ గది, స్కూల్ ఆవరణలోని సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాల గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు అంబాజీ, రమాదేవి, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, అదనపు వైద్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఎస్సై అంజనేయులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన గిన్నె సతీశ్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనలో బుధవారం ముద్రకోల్ల రాజా, ఆవుల రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27న ముత్యంపల్లి మాడల్‌స్కూల్, పోచమ్మ గుడి సమీపంలో మోటార్ సైకిల్‌పై వేగంగా వెళ్తున్న వారిని సతీశ్ మందలించాడు. దీంతో బూతులు తిడుతూ దాడిచేసి బండరాళ్లపై తోయడంతో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాధితుడి సోదరి లత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ


బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఇద్దరు మహిళల వద్ద నగదు చోరీకి గురైంది. మండలంలోని ఎర్వచింతల్‌కు చెందిన శివస్మితకు చెందిన రూ.5వేలతో పాటు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన సాయమ్మకు చెందిన రూ.20వేలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. జగిత్యాల బస్సు ఎక్కే క్రమంలో జనం రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు ఇదే అదనుగా చేతివాటం ప్రదర్శించారు. దీంతో బాధితులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు.

ఇద్దరికి ఆరునెలల జైలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ ఆదేశాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను జైలుకు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బైండోవర్ ప్రక్రియలో భాగంగా నిర్ణీత కాలంలో తగిన ష్యూరిటీలు అందించనందున వారిని ఆరునెలల జైలు శిక్షలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.


ఒకరికి ఐదేళ్లు..

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి మేసినేని కార్తిక్‌కు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి నిర్మల ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊరు మందమర్రికి చెందిన కార్తిక్ చిన్నతనంలోనే తలిదండ్రులను కోల్పోయి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఈక్రమంలో కార్తిక్ తన చిన్నమ్మ మేసినేని భీమక్కను మద్యం కోసం డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమె తలపై బండరాయితో దాడి చేశాడు. భీమక్క కుమారుడు సంజీవ్ తన తల్లిపై జరిగిన దాడి విషయంపై కార్తిక్‌ను మందలించాడు. తనను సంజీవ్ మందలించాడనే విషయాన్ని మనసులో పెట్టుకుని 23 ఫిబ్రవరి 2020న సంజీవ్ ఇంట్లో ఉన్నప్పుడు గొడ్డలితో తలపై దాడి చేశాడు. దీంతో సంజీవ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేయగా తర్వాత ఎస్సై భూమేశ్ దర్యాప్తు చేపట్టారు. కేసు ట్రయల్ సమయంలో కోర్టు కానిస్టేబుల్ సురేందర్ ముఖ్య సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ విచారణలో కీలకపాత్ర పోషించారు. నిందితునికి విచారణ అనంతరం ఐదేళ్ల శిక్ష.విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా నిందితునికి శిక్ష పడేలా చేసిన ఎస్సై, కానిస్టేబుల్, పీపీ తదితరులను డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అభినందించారు.

వ్యాపారిని బెదిరించిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: ఎడ్లు తరలిస్తున్న వ్యాపారిని ఆపి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఎండీ సాదిక్ అనే వ్యాపారి మంగళవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి వెళ్లి రెండు ఎడ్లను కొనుగోలు చేసి ఆటోలో ఇచ్చోడకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇంద్రవెల్లి మార్కెట్ వద్ద తగ్రే ఇందల్‌తోపాటు మరికొందరు ఆటో ఆపి ఎడ్లకు సంబంధించిన పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బులు డిమాండ్ చేసి ఘర్షణకు దిగారు. దీనిపై ఎండీ సాదిక్ ఫిర్యాదు మేరకు తగ్రే ఇందల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిని ఉట్నూర్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పవర్ ప్లాంట్‌లో సింగరేణి డైరెక్టర్


ప్లాంట్ అధికారులతో తిరుమలరావు

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో బుధవారం సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) ఎం.తిరుమలరావు పర్యటించారు. ముందుగా ఆవరణలో మొక్క నాటారు. అడ్మిన్ కార్యాలయంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. విద్యుదుత్పత్తి, పనితీరుపై అధికారులు వివరించారు. ఉత్పత్తిలో దేశస్థాయిలో ఇప్పటివరకు 50కిపైగా అవార్డులు అందుకోవడంపై హర్షం వ్యక్తంజేశారు. ఇదేస్ఫూర్తితో 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

శిక్షణ కేంద్రంలో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రంలో ప్రవేశాలు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 10–20 ఏళ్లలోపు బాలబాలికలు వివరాలకు కోచ్ రాజేశ్‌ను 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కన్నీళ్లు పెట్టుకున్న హైకోర్టు జడ్జి

- సహాయకుడి అంత్యక్రియలకు హాజరైన శ్రీదేవి దంపతులు


భౌతికకాయం వద్ద కన్నీరు పెట్టుకుంటున్న శ్రీదేవి-శ్రీహరిరావు దంపతులు

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామానికి చెందిన ఉదయ్ అనే యువకుడు మంగళవారం కనకాపూర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం నల్దుర్తి గ్రామంలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తమ నివాసంలో సహాయకుడిగా పనిచేసే ఉదయ్ అంత్యక్రియలకు హైకోర్టు జడ్జి జువ్వాడి శ్రీదేవి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు దంపతులు హాజరయ్యారు. తమ కుటుంబంలో ఒకరిగా మెదిలిన ఉదయ్ భౌతికకాయం చూడగానే భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. తల్లిదండ్రులు లేని ఉదయ్ కొన్నేళ్లుగా తమ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా ఉంటున్నాడని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. అంత్యక్రియల్లో గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు

వాంకిడి: పత్తి చేసులో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్లీ గ్రామ శివారులోగల పత్తి చేనులో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెరకవాడకు చెందిన ఆకిరెడ్డి పోచయ్య అనే వ్యక్తి చేనులో ఎనిమిది గంజాయి మొక్కలు, ఆర్లి గ్రామానికి చెందిన కావుడె బాజీరావు చేనులో 11 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. మొక్కలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


గంజాయి మొక్కలతో ఎస్సై మహేందర్

రూ.50 లక్షల విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం!

గుడిహత్నూర్: మండలంలోని తోయగూడ శివారు ప్రాంతంలోని వ్యవసాయ చేనులో సుమారు రూ.50లక్షల విలువైన గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. మండలంలోని తోషం గ్రామానికి చెందిన బాపురావ్ చేనులో రెండు చోట్ల సుమారు 500 గంజాయి మొక్కలు సాగు చేసినట్లు సీసీఎస్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. తాము విచారణ చేపడుతున్నామని, పూర్తి సమాచారం అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కాగా, ఇంత పెద్ద మొత్తంలో గంజాయి సాగు బహిర్గతం కావడం మండలంలో చర్చనీయాంశమైంది.

ఎస్బీఐ కేసును ఛేదించిన పోలీసులు?

- ఒక్కరోజే 2కిలోల నగలు రికవరీ


చెన్నూర్‌లో నగలు రికవరీ చేస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లో గత నెల 23న అపహరణకు గురైన 20కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు సమాచారం. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు 10రోజుల వ్యవధిలోనే ప్రధాన నిందితునితోపాటు ఈ ఘటనలో భాగస్వామ్యమున్న మరో 46 మందిపై కేసు నమోదు చేశారు. 43మందిని రిమాండ్‌కు పంపించారు. గత నెల 31న 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ వెల్లడించిన విషయం తెలిసిందే. చెన్నూర్ ఎస్బీఐ కేసులో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో రోజురోజుకూ పురోగతి సాధించారు. ఈ నెల 31నుంచి బంగారు నగల రికవరీని ప్రారంభించారు. వివిధ ఫైనాన్స్ కంపెనీలు, గోల్డ్‌లోన్ కంపెనీలు, ఫైనాన్స్ సంస్థల నుంచి 18కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని గత మంగళవారం తెల్లవారుజామున చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లోని సేఫ్టీ లాకర్‌లో భద్రపరిచారు. ఈ కేసులో పోలీసులు దూకుడుగా వ్యవహరించి గోల్డ్‌లోన్ బాధితులకు అడుగడుగునా భరోసానిస్తున్నారు. ఏక కాలంలో మంచిర్యాల మణప్పురం, ముత్తూట్ ఫిన్ క్రాప్‌ల నుంచి మరో రెండు కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు పోలీసులు పూర్తిస్థాయిలో బంగారు నగలు రికవరీ చేసినట్లు తెలిసింది.

నేడు వివరాలు వెల్లడించనున్న పోలీసులు!

బంగారు ఆభరణాల రికవరీ విషయాన్ని గురువారం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించనున్నట్లు సమాచారం. 20రోజులుగా ఆందోళనకు గురవుతున్నా గోల్డ్‌లోన్ బాధితులకు పూర్తి భరోసా ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వివిధ ఫైనాన్స్ కంపెనీల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను త్వరగా కోర్టుకు అప్పగించి బ్యాంక్ ద్వారా బాధితులకు ఇచ్చేలా చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఏదేమైనా రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఎస్బీఐ బ్రాంచ్ నుంచి బంగారు ఆభరణాల అపహరణ కేసును రామగుండం సీపీ ఆధ్వర్యంలో మంచిర్యాల డివిజన్ పోలీసులు అనతికాలంలో ఛేదించడం విశేషం.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అర్జున్, సంతోష్

ఇంద్రవెల్లి: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని దనోరా (బీ) గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, 108 పైలట్ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్‌కు చెందిన సంతోష్ తన స్నేహితుడు బాలాజీతో కలిసి ద్విచక్ర వాహనంపై దనోరా నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి ఎక్కుతున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వైపు కుటుంబ సభ్యులతో వస్తున్న ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన టిత్రే అర్జున్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మన్నూర్‌కు చెందిన సంతోష్‌కు ఎడమ చేయికి తీవ్ర గాయాలు కాగా, తోడుగా ఉన్న బాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన అర్జున్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా, అతడి భార్య శారద కుడి చేతికి గాయాలయ్యాయి. పెద్ద కొడుకు కార్తిక్‌కు ముక్కు, తలకు, చిన్న కొడుకు రితిక్‌కు ఎడమ కాలుకు తీవ్ర గాయాలైనట్లు వారు తెలిపారు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఇన్సాస్ రైఫిల్ తస్కరించిన నేవీ కానిస్టేబుల్

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అర్ధరాత్రి ముంబయి క్రైం బ్రాంచ్ సోదాలు
- ఆయుధంతోపాటు 40తూటాలు, 3 మ్యాగ్జిన్లు స్వాధీనం


పోలీసుల అదుపులో రాకేశ్, ఉమేశ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ముంబయిలో ఓ నేవీ కానిస్టేబుల్ తస్కరించిన ఇన్సాస్ రైఫిల్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆ నగర క్రైం బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల రాకేశ్ రెండేళ్ల క్రితం నేవీలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ఫిబ్రవరి వరకు ముంబయిలో విధులు నిర్వర్తించాడు. ఇటీవల కేరళలోని ఎర్నాకుళంకు బదిలీపై వెళ్లాడు. కాగా, ఈ నెల 6న రాకేశ్ తన అన్న దుబ్బుల ఉమేశ్‌తో కలిసి ముంబయి నేవీ కేంద్రానికి వెళ్లాడు. సెంట్రీ స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్‌తోపాటు, 40 తూటాలు, మూడు మ్యాగ్జిన్లను వారు దొంగిలించారు. ఆయుధంతో ఇద్దరు సోదరులు స్వగ్రామం ఎల్కపల్లికి చేరుకున్నారు. నేవీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన క్రైం బ్రాంచ్ పోలీసులు, స్థానిక పోలీసు అధికారుల సహకారంతో నిందితులను మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఆయుధం, తూటాలు, మ్యాగ్జిన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ముంబయి క్రైం బ్రాంచ్‌కు సహకరించిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. దేశ భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న యువకుడు పక్కా ప్రణాళిక ప్రకారం ఆయుధాన్ని దొంగలించి, సొంత గ్రామానికి తీసుకురావడంలో కుట్ర కోణం దాగి ఉన్నట్లు తెలుస్తోంది. అధికారుల పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.